సాక్షి
కుమురం భీం

గురువారం ׀ 23 ׀ మే ׀ 2024



ఇక 'స్థానిక' సమరం!
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి ప్రకటనతో పల్లెల్లో నాయకులు, ఆశావహుల సందడి మొదలైంది. 8లో▸



అప్రకటిత విద్యుత్ కోతలు
విద్యుత్ కోతలు లేవని ప్రభుత్వం చెబుతుండగా క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యుత్ అంతరాయంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.7 /29.8

వాతావరణం
చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కెరమెరి(ఆసిఫాబాద్): వేసవిలో సంక్రమించే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి తుకారం భట్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంతోపాటు గోయగాంలోని వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం సాయంత్రం సందర్శించారు. రికార్డులు పరిశీలించి ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. మండల ప్రజలకు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు రాందాస్, శ్రీదివ్య, వైద్యసిబ్బంది లలిత, రాధాలక్ష్మి తదితరులు ఉన్నారు.

టెక్ట్స్ బుక్ రైటర్‌గా సతీశ్



సతీశ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న పీటీజీ ఉపాధ్యాయుడు సతీశ్ టెక్ట్స్ బుక్ రైటర్‌గా ఎంపికైనట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి బుధవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (హైదరాబాద్) ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించే వర్క్‌షాపులో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తరఫున సతీశ్ పాల్గొంటారని పేర్కొన్నారు. హైస్కూల్ జీవశాస్త్రం పాఠ్యపుస్తకం, అకాడమిక్ స్టాండర్డ్స్‌తో కూడిన క్వశ్చన్‌బ్యాంకు తయారీలో పాలుపంచుకుంటారని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. దివాకర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం పథకంలో 78 క్యాడర్లతో సుమారు 17,514 మంది ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలుగా వీరికి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఈ నెల 23లోగా పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే 24న కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగులు అశోక్, షకీల్, సాయి ప్రసాద్, ప్రవీణ్, మమత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు అలీబిన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మోడల్ స్కూల్‌కు రావాలని సూచించారు. వివరాలకు 99493 00668 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాగుకు సంసిద్ధం



- వానాకాలం సీజన్ సాగు ప్రణాళిక ఖరారు
- జిల్లాలో 4,52,348 ఎకరాల్లో పంటల సాగు అంచనా
- ఈసారి కూడా పత్తి వైపే రైతుల మొగ్గు
- ముందస్తు వర్షాలతో విత్తనాలు విత్తేందుకు చర్యలు

ఆసిఫాబాద్: జిల్లాలో వానాకాలం సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. ఎరువులు, విత్తనాలు సమకూర్చేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో 4,52,348 ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న, కంది, పెసర తదితర పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. మరోసారి జిల్లా రైతులు తెల్లబంగారం వైపు మొగ్గు చూపనున్నారు. రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు అలంకారప్రాయంగా మారడంతో వరి సాగు అంతంతే ఉండనుంది. ఆరుతడి పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

పత్తి వైపే మొగ్గు..
పత్తి లాభసాటి పంట కావడంతో వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి సాగుపై మొగ్గు చూపుతారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. గతేడాది జిల్లాలో 4,55,033 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా 3,42,000 ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 4,52,348 ఎకరాల్లో పంటలు సాగు చేయనుండగా, వీటిలో 3,40,000 ఎకరాల్లో పత్తి పంట రైతులు సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే పత్తి సాగు స్వల్పంగా తగ్గనుండగా.. ఇతర పంటల సాగు పెరగనుంది. 59,212 ఎకరాల్లో వరి, 38,239 ఎకరాల్లో కంది, 6089 ఎకరాల్లో సోయాబీన్, 1700 ఎకరాల్లో పెసర, 680 ఎకరాల్లో జొన్న, 742 ఎకరాల్లో మొక్కజొన్న, 163 ఎకరాల్లో మినుము, 178 ఎకరాల్లో వేరుశనగతోపాటు 2200 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు
వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. మరో 15 రోజుల్లో నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించనున్నాయి. సాగుకు అనుకూలంగా కనీసం 60 మిల్లీమీటర్ల వర్షం కురిస్తేనే విత్తనాలు వేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. ఇప్పటికే అకాల వర్షాలు కురవడం ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడింది. అల్పపీడన ప్రభావంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో వర్షం కురిసే అవకాశం ఉండటం, నైరుతి రుతుపవనాలు కూడా సకాలంలో విస్తరిస్తాయనే అంచనాలు ఉండటంతో రైతులు కోటి ఆశలతో సాగుకు సంసిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్ని చేలు సిద్ధం చేసిన రైతులు జూన్‌లో తొలకరి వర్షాలతో విత్తనాలు విత్తేందుకు ఎదురుచూస్తున్నారు.

విత్తన ఎంపికే కీలకం

పత్తి పంట సాగులో విత్తన ఎంపిక కీలకంగా మారనుంది. ఏటా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారు. నకిలీ విత్తన మాఫియా బీజీ-3 లూజు విత్తనాలను ప్యాక్ చేసి అమాయకులకు అంటగడుతోంది. ఈ క్రమంలో రైతులు వాటిని కొనుగోలు చేసి దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒకే రకమైన పంటలు, ఒకే రకమైన విత్తనాలతో సాగు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. నాలుగు కంపెనీలకు చెందిన నాలుగు రకాల విత్తనాలు ఎంపిక చేసుకోవాలంటున్నారు. ముఖ్యంగా లూజు విత్తనాలు కొంటే నష్టపోయే ప్రమాదం ఉంది. పత్తిలో అంతర పంటగా కంది సాగు చేయడం ద్వారా పురుగు బెడద తగ్గి దిగుబడి పెరుగుతుంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో విధిగా బిల్లులు తీసుకోవాలని సూచిస్తున్నారు. జీలుగు క్వింటాల్‌కు రూ.9300 ఉండగా, 60 శాతం సబ్సిడీ కింద రూ.5580కి అందిస్తున్నట్లు, 30 కిలోల బస్తా రూ.1016 చెల్లించి తీసుకోవాలని డీఏవో శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లాకు కావాల్సిన విత్తనాలు

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	విత్తనాలు (క్వింటాళ్లలో)
వరి	59,212	14,803
జొన్న	680	27.20
మొక్కజొన్న	742	59.36
కంది	38,239	1147.17
పెసర	1700	136
మినుము	163	13.04
వేరుశనగ	178	106.80
సోయాబీన్	6089	1826.70
ఇతర పంటలు	2152	5.38
పత్తి	3,40,000	7,00,000 ప్యాకెట్లు
మొత్తం	4,52,348	18,125

అవసరమైన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

రకం	అవసరం	అందుబాటులో ఉన్నవి
యూరియా	45060	17764.322
డీఏపీ	11,265.39	609
పొటాష్	4,053.01	147.55
సూపర్ ఫాస్పేట్	3000	567.10
కాంప్లెక్స్	22,538.03	1235.71

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

వానాకాలం సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. క్యూఆర్ కోడ్ ఉన్న ప్యాకెట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. బీజీ- 3, లూజు విత్తనాలు తీసుకోవద్దు. డీఏపీ, ఎస్ఎస్‌పీ ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. లేదంటే విత్తనాలు మొలకెత్తవు. గ్లైసిల్ గడ్డి మందు వాడితే చర్యలు తీసుకుంటాం.

– రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నకిలీ విత్తనాలపై దృష్టి సారించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: నకిలీ విత్తనాల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షతోపాటు నకిలీ విత్తనాలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధికారులు అప్రమత్తతతో ఉండి సమాచారం సేకరించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్లలో కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక నార్కోటిక్ డ్రైవ్, చెక్‌పోస్టు విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, సిర్పూర్(టి) ఎస్సై రమేశ్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, టౌన్ సీఐ శంకరయ్య, కెరమెరి ఎస్సై విజయ్‌లకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. సమావేశంలో డీఏ స్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సురేశ్‌కుమార్ హెచ్చరించారు. నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టేందుకు జిల్లాలో పోలీసు, వ్యవసాయ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టేవిధంగా ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

కేవీకే స్వర్ణోత్సవం



బెల్లంపల్లి కేవీకే కార్యాలయ భవనం

- దేశంలో ఏర్పాటై 50వసంతాలు పూర్తి
- వేడుకలకు సర్వం సిద్ధం
- రైతులకు అవగాహన కార్యక్రమాలు

బెల్లంపల్లి: రైతులకు ఆధునిక వ్యవసాయ సలహాలు, శాస్త్ర, సాంకేతిక అంశాలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో దేశంలో ఏర్పడిన కృషి విజ్ఞాన కేంద్రాలు(కేవీకే) యాభై వసంతాలు పూర్తి చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో స్వర్ణోత్సవ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, బెల్లంపల్లి కేవీకేల్లో రైతు శిక్షణ తరగతులు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు. స్వర్ణోత్సవ జయంతి జ్యోతి గురువారం బెల్లంపల్లికి చేరుకోనుండగా.. ఘనస్వాగతం పలకడానికి కేవీకే యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

పుదుచ్చేరిలో మొదటగా..
భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో 1974 మార్చి 21న దేశంలో తొలిసారిగా పుదుచ్చేరిలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభించారు. దేశంలో పది జోన్లు ఏర్పాటు చేసి వీటి పరిధిలో 735 కేవీకేలను విస్తరించారు. పదో జోన్ పరిధిలో పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను చేర్చారు. ఈ జోన్‌లో 72 కేవీకేలు ఉండగా రాష్ట్రంలో 16 రైతాంగానికి వ్యవసాయ సేవలు అందిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ కేంద్రంగా కేవీకేను ప్రారంభించగా, 2018 మార్చి 17న ఢిల్లీ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రధానమంత్రి మోదీ బెల్లంపల్లి కేవీకేను ప్రారంభించారు. ఇవి ఉమ్మడి జిల్లా రైతులకు వ్యవసాయ సేవలు, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి.

స్వర్ణోత్సవ జయంతి జ్యోతి రాక
స్వర్ణోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో గత నెల 22న స్వర్ణోత్సవ జయంతి జ్యోతిని నల్గొండ జిల్లా కంపసాగర్ కేవీకేలో ప్రారంభించారు. ఇప్పటివరకు గడ్డిపల్లి, వైరా, కొత్తగూడెం, మల్యాల్, మామ్నూర్, జమ్మికుంట, రామగిరిఖిల్లా కేవీకేకు చేరుకోగా అక్కడి నుంచి బెల్లంపల్లి కేవీకేకు తీసుకు రానున్నారు. ఈ నెల 24వరకు శిక్షణ తరగతులు, వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహించి రైతులను చైతన్యవంతం చేస్తారు. 25న బెల్లంపల్లి నుంచి స్వర్ణోత్సవ జయంతి జ్యోతి బయల్దేరి ఆదిలాబాద్ కేవీకేకు చేరుకుంటుంది. అక్కడ 27 వరకు కార్యక్రమాలు నిర్వహించి 28న రుద్రూర్ కేవీకేకు తీసుకెళ్తారు.

రైతాంగానికి శిక్షణ తరగతులు

బెల్లంపల్లి కేవీకేలో స్వర్ణోత్సవ జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయంలో శాస్త్ర, సాంకేతిక, వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తారు. ప్రదర్శనలు, క్షేత్ర దినోత్సవాలు నిర్వహిస్తారు. బెల్లంపల్లి కేవీకేలో ఇప్పటివరకు 250కి పైగా రైతు క్షేత్రాల్లో నూనెగింజలు, పప్పు దినుసుల పంటలపై ప్రథమ శ్రేణి ప్రదర్శనలు నిర్వహించారు. గ్రామాల్లో సర్వే చేసి ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇప్పించారు. మహిళా రైతులకు గృహ విజ్ఞాన సంబంధిత కార్యక్రమాలు, విత్తనోత్పత్తిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు, ఎస్సీ, ఎస్టీ, ఉప ప్రణాళికతో వ్యవసాయ రంగంపై యువతను ఆకర్షించేందుకు శిక్షణ తరగతులు అమలు చేస్తున్నారు.

ఆదాయం రెట్టింపే లక్ష్యం



పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేస్తున్నాం. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తూ అధిక దిగుబడులు సాధించడానికి తోడ్పడుతున్నాం. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కృషి చేస్తున్నాం. కేవీకే స్వర్ణోత్సవ వేడుకలను రైతులు విజయవంతం చేయాలి.

– కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, బెల్లంపల్లి

ఉద్యానవన నర్సరీలను అభివృద్ధి చేస్తాం

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మొక్కలు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

కాగజ్‌నగర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ ఉద్యానవన నర్సరీలను బలోపేతం చేసి మరింత అభివృద్ధి చేస్తామని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. కాగజ్‌నగర్ మండలం జంబుగాలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీని బుధవారం పరిశీలించారు. నర్సరీలో సాగు చేస్తున్న మామిడి, నిమ్మ, జామ, సపోట వండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నర్సరీ ద్వారా మెరుగైన ఆదాయం పొందడంతోపాటు గిరిజన రైతులు, దినసరి కూలీలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నర్సరీలో ఉన్న ఖాళీ స్థలాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులకు ఆదాయం వచ్చేవిధంగా పంటలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్, సుధీర్‌కుమార్, సిబ్బంది సాయి, రాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'దేశ ఆర్థిక పరిపుష్టి బీజేపీతోనే సాధ్యం'



మాట్లాడుతున్న గోడం నగేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: దేశ ఆర్థిక పరిపుష్టి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రజలు చూపిన ఆదరణతో లక్షకు పైగా మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసించి బీజేపీకి అండగా నిలిచారన్నారు. మండుటెండల్లో శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనూ బీజేపీ పదికి పైగా ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుదని ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల నుంచి జిల్లా మీదుగా మహారాష్ట్ర వరకు రూ.2.5వేల కోట్లతో హైవే రోడ్డు నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రూర్బన్ నిధుల ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్నాక విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు ప్రసాద్, విలాస్, ప్రహ్లాద్, సత్యనారాయణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణకు పాటుపడాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్ అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కుమురం భీం, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్య రక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వన్యప్రాణులను రక్షిస్తేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఏటా వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్ వరకు చేరుతున్నాయంటే పర్యావరణ సమతుల్యం లేకపోవడమే కారణమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు శ్రీధర్ చారి, సరోజ రాణి, సెక్షన్ అధికారులు సత్యనారాయణ, లక్ష్మణ్, సతీశ్, కొమ్మాల్, బీట్ అధికారులు రాజేశ్, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని పర్దాన్‌గూడలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనుల పురోగతిని బుధవారం పరిశీలించారు. వేసవి సెలవులు ముగిసేలోపు పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతులు పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, టాయిలెట్లు, శానిటేషన్ పనులు, ఫ్యాన్ల ఏర్పాటు, తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. స్కూళ్ల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలన్నారు. మొక్కలు నాటి విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని సంఘం బస్తీలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న వంట గదికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రావొద్దు
సిర్పూర్(టి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రావొద్దని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి, దుబ్బగూడ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే అచ్చెల్లి, సిర్పూర్(టి) పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గొల్లవాడ కాలనీలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రంలో యూనిఫాంలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఈవో అశోక్, ఆర్డీవో సురేశ్, డీఎల్‌పీవో సురేశ్, ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డి కట్టలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జన్నారం: మండలంలోని రేండ్లగూడ గ్రామంలో గడ్డి కట్టలను ట్రాక్టర్‌పై తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కట్టలు మినీ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రేండ్లగూడకు చెందిన కుతుబు వేరేచోట 90 గడ్డి కట్టలు కొనుగోలు చేసి ట్రాక్టర్ ద్వారా ఇంటికి తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కట్టలు మినీ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడగా మంటలు చెలరేగాయి. గడ్డి కట్టలు కాలుతుండగా గ్రామస్తులు వాటిని కిందికి తోసేసి ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తొలగించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వాహనంతో అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు కుతుబు తెలిపారు.

హత్య కేసులో ఒకరి రిమాండ్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన గుర్లె చంద్రశేఖర్‌ను హత్య చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గుర్లె సురేశ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. తాగిన మైకంలో చంద్రశేఖర్ తలపై సురేశ్ ఇటుకతో బాదడంతో తీవ్ర గాయాలపాలై చంద్రశేఖర్ మృతిచెందాడని పేర్కొన్నారు. విచారణ చేపట్టి సురేశ్‌ను అరెస్టు చేశామని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ గోండుగూడాలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న క్రుసంగే సాయికుమార్ (21) కొంతకాలంగా ఏ పనీ చేయకుండా మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి తాగి వచ్చిన సాయికుమార్‌ను అతడి తల్లి గంగుబాయి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సాయికుమార్ ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియాలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పాత బస్టాండ్ ఏరియాలోని బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ఉన్న తోపుడు బండిపై బుధవారం మధ్యాహ్నం 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి నిద్రకు ఉపక్రమించాడు. రాత్రి 8 గంటలకు కొందరు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. వడదెబ్బ తగిలి చనిపోయాడా, మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపర్చారు.

ఇక 'స్థానిక' సమరం!

- జూలైలో ఎన్నికల నిర్వహణకు ఛాన్స్
- కులగణన చేపడితే మరింత జాప్యం
- ముగిసిన సర్పంచుల పదవీ కాలం
- గ్రామపంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన



వదూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

నేరడిగొండ/నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. జూన్ 4న లెక్కింపు నిర్వహించనున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించిన విషయాలు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని సూత్రప్రాయంగా సీఎం తెలపడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియగా.. 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల నిర్వహణకు బ్రేక్ పడింది. మరికొద్ది రోజుల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనపై పల్లెల్లో నాయకులు, ఆశావహుల సందడి మొదలైంది.

ఈసారి అన్ని ఎన్నికలు ఒకేసారి!

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలను గతంలో మూడు దశల్లో నిర్వహించారు. మొదట సర్పంచ్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియగా, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం జూలై 3వరకు, జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం జూలై 5 వరకు ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈసారి మూడు విభాగాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

కులగణనకు ఉత్తర్వులు జారీ..

గత ఎన్నికల సమయంలో అధికార కాంగ్రెస్ కులగణన చేపడతామని హామీ ఇచ్చింది. ఈమేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ ప్రక్రియ కోసం సుమారు రెండు నెలలు పట్టే అవకాశముంది. అయితే కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఆలోచన ఉంటే మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సమరంలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే విషయమై నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.

సిద్ధంగా ఉండాలని ఆదేశాలు

గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకోసం యంత్రాంగం సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా అధికారులు గ్రామపంచాయతీలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు ప్రభుత్వానికి పంపించారు. ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు ఎన్ని ఉన్నాయనే వివరాలు కూడా తెలియజేశారు. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ నుంచి బ్యాలెట్ బాక్సులు తెచ్చుకోవాలని నిర్మల్ జిల్లాకు ఆదేశాలు అందాయి.

బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు

గ్రామపంచాయతీల ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు. సర్పంచులను నేరుగా ఎన్నుకోనుండగా, ఉపసర్పంచ్‌ను పరోక్ష పద్ధతిన ఎన్నుకుంటారు. వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికల కోసం ప్రతీ వార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుడికి వేర్వేరుగా తెలుపు, గులాబీ రంగు బ్యాలెట్ పేపర్లను ముద్రించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికలకు రాజకీయ పార్టీల గుర్తులుండవు. ముందుగానే ముగ్గురు, నలుగురు పేర్లతో కూడిన నమూనా బ్యాలెట్ పేపర్లను మూడు, నాలుగు విధాలుగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

200 మందికో పోలింగ్ కేంద్రం

ప్రతీ 200 మందికో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ అధికారి ఉంటారు. అంతకుమించి ఓటర్లు ఆ వార్డులో 200 నుంచి 400మంది ఉంటే ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు సహాయ అధికారులను నియమిస్తారు. 400 నుంచి 650 మంది ఓటర్లుంటే ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు సహాయ అధికారులను నియమించాలని నిర్ణయించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తారు.

జిల్లాల వారీగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు సభ్యుల స్థానాలు

జిల్లా	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	జీపీలు	వార్డు సభ్యులు
ఆదిలాబాద్	158	17	17	467	3,840
మంచిర్యాల	130	16	16	311	2,730
కుమురంభీం	123	15	15	334	2,874
నిర్మల్	156	18	18	396	3,336
మొత్తం	567	66	66	1,508	12,780

పలు రైళ్ల హాల్టింగులు రద్దు

తాండూర్: మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగులను జూన్ 30వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం రోడ్-విజయవాడ (ట్రైన్ నంబర్ 07278/07979), సికింద్రాబాద్-వరంగల్ (ట్రైన్ నంబర్ 07462/07463), కాజీపేట్-బల్లార్షా (ట్రైన్ నంబర్ 17035/17036), సిర్పూర్ టౌన్-కరీంనగర్ (ట్రైన్ నంబర్ 07766/07765), కరీంనగర్-బోధన్ (ట్రైన్ నంబర్ 07894/ 07893) రైళ్ల అప్ అండ్ డౌన్ రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న 16 మంది కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు బుధవారం సీహెచ్‌పీలో ఆందోళన చేపట్టారు. షేల్ పికింగ్ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఐదునెలలుగా వేతనాలు చెల్లించకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సదరు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, గజ్జి మల్లేశ్, మహేశ్వర్ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడాలి



ఐకే-ఓసీపీని సందర్శిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం సంజీవరెడ్డి

జైపూర్: వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఓసీపీలు, సంపు ఏరియాల్లోని బొగ్గును వీలైనంత త్వరగా ఉత్పత్తి చేసి రవాణా చేయాలని, ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే-ఓసీపీ ప్రాజెక్టును బుధవారం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డితో కలిసి వెంకటేశ్వర్‌రెడ్డి ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఓసీపీ ప్రాజెక్టును వారు సందర్శించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలని సూచించారు. ఇందుకు ఉద్యోగుల సమష్టి కృషి అవసరమని చెప్పారు. రోజువారీ వోబీ ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని, వోబీ ఎంత ఎక్కువగా తీస్తే బొగ్గు అంతా ఎక్కువ ఉత్పత్తి రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు పలు ఆదేశాలు ఇచ్చారు. ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్ తదితరులున్నారు.

మౌలిక వసతులు మెరుగుపరచాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి గనులపై మౌలిక వసతులు మెరుగుపరచాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే-5 గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనులపై రెస్ట్‌హాల్స్, సైకిల్ షెడ్లు, భోజనశాలలను ఆధునీకరించాలని కోరారు. నాణ్యమైన పనిముట్లు అందించాలని, కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను తొలగించాలని, వాటి స్థానంలో కొత్త యంత్రాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీఎల్ యంత్రాల్లో వాడే నాసిరకం ఆయిల్‌తో అవి పాడవుతున్నాయని, నాణ్యమైన ఆయిల్‌ను వినియోగించాలని సూచించారు. పని స్థలాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ రుణాల క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని కోరారు. సమస్యలు యాజమాన్యానికి వివరించి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, బుచ్చిప్రసాద్, నర్సింగ రావు, మురళి చౌదరి, సంఘం సదానందం, అఫ్రోజ్‌ఖాన్, సత్తిరెడ్డి, భోగా మదనయ్య పాల్గొన్నారు.

న్యాయ నిర్ణేతలుగా ఎంపిక



న్యాయ నిర్ణేతలుగా ఎంపికైన క్రీడాకారులు

బెల్లంపల్లి: గద్వాల్ పట్టణంలో ఈ నెల 19నుంచి 21వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ నిర్ణేతల సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి 10 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఎనిమిది మంది న్యాయ నిర్ణేతలుగా అర్హత సాధించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చి రామారావు, జిల్లపల్లి వెంకటస్వామి తెలిపారు. జాతీయ న్యాయ నిర్ణేతగా 12 ఏళ్ల జిల్లపల్లి జై చంద్రప్రసాద్ ఎంపికై రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఎంపికైన తైక్వాండో క్రీడాకారులను ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజులాల్, రాజ్‌మహ్మద్ తదితరులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



సాక్షులను విచారిస్తున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. బుధవారం పట్టణంలోని పాలచెట్టు ఏరియా సమీపంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సాక్షులను విచారించారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగపల్లి గ్రామానికి చెందిన అక్కపాక శంకర్, చంద్రకళ పాలచెట్టు ఏరియా సమీపంలో గొడవపడ్డారు. శంకర్‌ను చంద్రకళ కులం పేరిట దూషించినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సాక్షులను విచారించారు. నిజానిజాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

కంపోస్టు ఎరువు ఉపయోగించాలి

జైపూర్: కంపోస్ట్ పిట్‌ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, వాటి ద్వారా వచ్చే ఎరువులను నర్సరీలు, పల్లెప్రకృతి వనంలో మొక్కలకు అందించాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ముదిగుంట, జైపూర్ గ్రామ పంచాయతీలను బుధవారం ఆయన సందర్శించారు. సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించి కంపోస్ట్ ఎ రువుల తయారీపై పలు సూచనలు చేశారు. రోడ్లు, డ్రైయినేజీలు నిరంతరం శుభ్రం చేయాలని, ప్రతీ రోజు ఇంటింటికీ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వా రా చెత్త సేకరించాలని తెలిపారు. ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్, సురేశ్, సిబ్బంది ఉన్నారు.

యాప్ సరే.. అవగాహనేది?

- ఓపీ నమోదుకు కొత్త యాప్
- ఆస్పత్రిలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- అవగాహన లేక రోగుల ఇబ్బందులు



ఓపీ రోగుల కోసం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ వద్ద క్యూలో రోగులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ(ఔట్ పేషెంట్లు) నమోదుకు అమలు చేస్తున్న యాప్‌పై అవగాహన లేక రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు వరుసలో ఎక్కువ సేపు నిలబడి ఉండకుండా ప్రభుత్వం క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఓపీ కోసం వచ్చే రోగులు 'అబా' యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని టోకెన్ పొందేలా వారం రోజులుగా అమలు చేస్తోంది. బుధవారం ఆస్పత్రికి వచ్చిన రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం, క్యూఆర్ కోడ్, యాప్ ఇన్‌స్టాల్ ప్రక్రియ ఆలస్యం కావడంతో అసహనం వ్యక్తమైంది. రోగుల్లో పేదవారే ఉండడం, సాంకేతికతపై సరైన అవగాహన లేకపోవడం, క్యూఆర్ కోడ్ వినియోగం తెలియకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అవగాహన కల్పించేందుకు ఇద్దరు ఉద్యోగులను ఏర్పాటు చేసినా వచ్చిన రోగులందరికీ అవగాహన కల్పించలేకపోతున్నారు. దీంతో ఓపీ వద్ద రోగుల తోపులాట పెరగడం, తమకు యాప్ ఇన్‌స్టాల్ చేయాలంటూ ఒకేసారి అందరూ కోరడంతో బుధవారం గందరగోళం ఏర్పడింది. ప్రతీ రోజు 400కు పైగా రోగులు వస్తుండడంతో మరింత మందిని నియమించి ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇబ్బందులు తీర్చేందుకే..

ప్రస్తుతం ఆస్పత్రికి ప్రతీ రోజు 400కు పైగా ఔట్‌పేషెంట్లు వస్తుండగా, మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)కు 200కు పైగా వస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పెరిగి ఆ సంఖ్య 900పైగా ఉంటుంది. రోగులకు టోకెన్లు ఇచ్చి వైద్య పరీక్షలకు పంపిస్తుండగా గంటల తరబడి వరుసలో ఉండాల్సి వస్తోంది. దీంతో రోగుల వివరాలు కంప్యూటర్లో నమోదు చేసి టోకెన్ ఇచ్చేందుకు సమయం వృథా అవుతుండడం, రెండు కౌంటర్లు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఓపీ నమోదు కాగితం ఇచ్చేందుకు సమయం ఎక్కువగా పడుతుండడాన్ని అరికట్టేందుకు ఓపీ టోకెన్ ఇచ్చేందుకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చారు.

డౌన్‌లోడ్ ఇలా

ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నవారు ప్లేస్టోర్ నుంచి ఏబీహెచ్‌ఏ(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆస్పత్రిలో ఓపీ నమోదుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫోన్‌నంబరు లేదా ఆధార్‌నంబరు నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. మొబైల్ నంబరుకు వచ్చిన టోకెన్ నంబరును ఆస్పత్రి కౌంటర్‌లో చూపిస్తే ఓపీ చీటి డౌన్‌లోడ్ చేసి ఇస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఆస్పత్రిలో యాప్‌తో పాటు క్యూఆర్ కోడ్‌ను రోగుల ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసి వివరించేందుకు ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఎంసీహెచ్‌లోనూ క్యూఆర్ కోడ్ అమలులోకి తీసుకొచ్చాం. రోగులు స్వయంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ టోకెన్ ఎలా పొందాలనే దానిపై అవగాహన కల్పించేలా చూస్తున్నాం. ప్రజలందరికీ అవగాహన వచ్చేందుకు కొంత సమయం పడుతుంది. ఆ తరువాత క్యూలో ఉండాల్సిన అవసరం లేకుండానే క్యూఆర్ కోడ్, యాప్‌ల ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్‌ను సులభంగా చేసుకునే అవకాశం ఉంటుంది. స్మార్ట్‌ఫోన్‌తోపాటు వారి ఆధార్ కార్డుకు లింక్ చేసి ఉన్న మొబైల్ ఉంటేనే ఇది పనిచేస్తుంది.

– డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

వివాహిత అదృశ్యం



మేస్రం సీమ (ఫైల్)

వాంకిడి: భర్తతో గొడ వపడిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం చీచ్‌పల్లి గ్రామానికి చెందిన గేడం కాంతారావుకు పదేళ్ల క్రితం మహారాష్ట్రలోని రాజురకు చెందిన మేస్రం సీమతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కొద్ది రోజులుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా వీరి మధ్య గొడవ జరగడంతో సీమ తన పుట్టింటికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. అదేరోజు సాయంత్రం కాంతారావు సీమ తల్లి దండ్రులకు ఫోన్ చేసి అడగగా, ఆమె పుట్టింటికి వెళ్లలేదని తెలి సింది. బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా జాడ లభించలేదు. దీంతో కాంతారావు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశాడు. సీమ ఇంట్లో నుంచి బయటికి వెళ్లేటప్పుడు గులాబీ రంగు చీర ధరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రికార్డులను డిజిటలైజేషన్ చేయాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

శ్రీరాంపూర్: కంపెనీలో ఉద్యోగుల రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలని సింగరేణి డైరెక్టర్లు తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్), జీ వెంకటేశ్వర్‌రెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) ఏరియా జీఎం సంజీవరెడ్డి కలిసి సమీక్ష నిర్వహించారు. ఇక్కడి నుంచే ఐటీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగుల పర్సనల్ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేయాలని, వారి కుటుంబ సభ్యుల ఫొటోలనూ అందులో చేర్చాలన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉద్యోగుల క్వార్టర్ అలాట్మెంట్ లెటర్లు కూడా డిజిటలైజేషన్‌లో నమోదు చేయాలన్నారు. కోర్టు కేసులు ఇంకా ఇతర ఉద్యోగులకు సంబంధించిన వైద్య సదుపాయాలు, వైద్య చికిత్సకు సంబంధించినవి కూడా నమోదు చేయాలని సూచించారు. ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఎంపీటీసీ మేనేజర్ రామారావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఐటీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వానలు ఆటంకం కారాదు

రాబోయే వానాకాలంలో వర్షాలతో ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగరాదని డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్, ఇందారం ఓపెన్ కాస్ట్ గనులను సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. వానాకాలానికి ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ఏరియాలోని బొగ్గు నిల్వలను వెంటనే వెలికి తీసి ఉపరితలానికి రవాణా చేయాలని సూచించారు. వర్షపునీరు బయట నుంచి క్వారీలో చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓబీ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. రక్షణతో ఉద్యోగులు పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ అధికారి టీ శ్రీనివాస్, ఇందారం ఓపెన్ కాస్ట్ అధికారి ఎం.శ్రీనివాస్, మేనేజర్లు బ్రహ్మాజీ, రవికుమార్ పాల్గొన్నారు.

భారీగా నకిలీ విత్తనాల పట్టివేత



పట్టుకున్న నకిలీ విత్తనాలు, నిందితుడితో పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద మహారాష్ట్రకు తరలిస్తున్న 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడెం నుంచి మహారాష్ట్రకు నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు మంగళవారం రాత్రి సమయంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో గూడెం నుంచి మోటార్‌సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించారు. తమ వద్ద ఉన్న సంచులను పడేసి పారిపోవడానికి ప్రయత్నించగా ఒకరు పోలీసులకు చిక్కారు. అనంతరం విచారించగా పట్టుబడిన వ్యక్తి మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన చాపిలె వినోద్‌గా గుర్తించారు. పారిపోయిన వారు గంగాపూర్ గ్రామానికి చెందిన చాపిలె పురుషోత్తం, సిర్పూర్(టి) మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బొల్లబోయిన అశోక్, బొల్లబోయిన కృష్ణగా నిర్ధారించారు. పట్టుబడిన చాపిలె వినోద్‌ను చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. చాపిలె వినోద్, మిగతా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాల ధర సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని వివరించారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, పోలీస్ సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.